


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

సోమవారం 2 జూన్ 2025 పేజీలు 8


అక్రమంగా నిర్మిస్తున్న ఈ 'చర్చి'కి

# అడ్డుకట్టపడేది ఎప్పుడు..?

▲ అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు తగునా?.

▲ కోర్టు ఆదేశాలు భేఖాతరు

▲ నిద్రమత్తులో జోగుతున్న రెవెన్యూ, పోలీసు శాఖలు



మచిలీపట్నం మేజర్ న్యూస్ : అక్రమంగా నిర్మిస్తున్న ఈ 'చర్చి' కి అడ్డుకట్టపడేది ఎప్పుడు? అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ కిమ్మనకుండా మిన్న కుండిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోర్టు ఆదేశాలు భేఖాతరు చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టడం భావ్యమా? అని ప్రశ్నిస్తున్నారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని సాలిపేటలో గల చర్చి నిర్మాణం గత కొన్ని సంవత్సరాల నుండి కోర్టు వివాదంలో ఉంది. ఆ చర్చి నిర్మాణంపై ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించిన విషయం ఈ గ్రామస్తులు అందరికీ విధితమే. సదరు చర్చి నిర్మాణానికి సంబంధించిన భూములు అసైన్డ్ భూములు కావడంతో బాటు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్నారని బాబురావు అనే వ్యక్తి కోర్టును

2లో



## పారదర్శకంగా నిత్యావసర సరుకుల పంపిణీ

**దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వారికి ఇంటికే రేషన్ అందించేందుకు ఏర్పాట్లు....**

**విద్యాధరపురంలో రేషన్ షాపు ద్వారా నిత్యవసర వస్తువులు పంపిణీ పునః ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీ శ**

ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, జూన్ 1, మేజర్ న్యూస్: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేసేందుకు రేషన్ షాపులను పునః

మిగతా 2లో

# చౌకబియ్యం

## పక్కదారి పట్టకూడదు

- ప్రజల కోరిక మేరకే దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు
- నిత్యావసర సరుకులు పంపిణీ ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల



మచిలీపట్నం మేజర్ న్యూస్ : చౌక బియ్యం పక్కదారి పట్టకుండా ప్రజల కోరిక మేరకు మరల చౌక దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గనులు భూగర్భ వనలు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నగరంలోని 37వ డివిజన్ రాజుపేట లోని చౌక ధరల దుకాణం నంబరు 7ను మంత్రి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మలతో కలసి

మిగతా 2లో...



## పవిత్ర యోగా సంగమం

ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

2

(మొదటిపేజీ తరువాయి)

### అక్రమంగా నిర్మిస్తున్న ఈ 'చర్చి'కి

## అడ్డుకట్టపడేది ఎప్పుడు..?


ఆశ్రయించడం కూడా జరిగింది. కోర్టు అతడికి అనుకూలముగా తీర్పు ఇవ్వడంతో బాటు ఎలాంటి నిర్మాణాలు జరగకుండా చూడవలసిన బాధ్యత స్థానిక రెవెన్యూ శాఖకి, విఆర్ఓకి అప్పగిస్తూ ఆదేశాలు కూడా జారీ చేశారు. అప్పటినుండి ఎలాంటి నిర్మాణ పనులు జరగలేదు. ఇంతవరకు కథ బాగానే ఉంది. 'చర్చి' నిర్వహకులు,పలుమార్లు అడ్డదారుల్లో నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రయత్నించగా రెవిన్యూ శాఖ అడ్డుకోవడం కూడా జరిగింది. ఇటీవల చర్చి నిర్వాహకులు కోర్టు ఆదేశాలను పక్కనపెట్టి రాజకీయ పలుకుబడితో నిర్మాణ పనులు చేపట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసి సఫలత సాధించారు. ఒక దశలో విఆర్ఓ అడ్డుకొన్నా తరువాత ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేశారు. దీనికి 'ఆమ్యామ్యాలు' కూడా జత అయ్యాయని భోగట్టా. ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ రాత్రి, పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా నిర్మాణ పనులు చేపట్టడం జరిగింది. పోలీస్, రెవెన్యూ శాఖ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడక పోవడం విడ్డూరంగా ఉందని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం. మొత్తానికి చర్చి నిర్వాహకులు, నిర్మాణ పనులు యాదేచ్చగా పూర్తి చేసి సఫలత సాధించారు. అయితే కోర్టు ఆదేశాలను కూడా అమలు చేయరా? అంటూ పలువురు మేధావులు ప్రశ్నిస్తున్నారు. కోర్టు ఆదేశాలను పక్కనపెట్టి చర్చి నిర్మాణ పనులు చేపట్టిన వారిపై వెంటనే చర్య తీసుకోవాలని ఇక్కడి ప్రజానీకం కోరుతున్నారు. మొదట్లో చర్చి నిర్మాణ పనులు జరగకుండా రెవెన్యూ అధికారులు అడ్డు కున్నా, తర్వాత మిన్నకుండిపోవడం పట్ల పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడం వలన నిర్మాణ పనులు యదేచ్చగా చేపట్టారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.దీనికి సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

## పారదర్శంగా నిత్యావసర సరుకుల పంపిణీ



ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. రేషన్ షాపుల పునః ప్రారంభ కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యాధరపురంలో డీలర్ గురునాథం రేషన్ షాపులో జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ కార్డుదారులకు బియ్యాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువులను కార్డుదారులకు పునః ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో 957 రేషన్ షాపుల ద్వారా 5 లక్షల 90,243 కార్డుదారులకు 8వేల మెట్రిక్ టన్నులు బియ్యాన్ని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో దివ్యాంగులు, 65 ఏళ్ల పైబడిన 57,వేల 690 మంది కార్డుదారులను గుర్తించామని వారికి ఇంటి వద్దకే రేషన్ డీలర్లు సరుకులను తీసుకెళ్లి అందజేస్తారని చెప్పారు. ప్రతి నెల ఐదో తేదీ లోపు దివ్యాంగులు, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటికే రేషన్ సరుకులు తీసుకువెళ్లి అందజేయాలని ఆదేశించామన్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రతినెలా 1 నుంచి 15వ తేదీలోగా సరుకులు సరఫరా చేయాలని డీలర్లకు ఆదేశాలిచ్చామని, ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరచివుంచి సరుకులు అందించేందుకు చర్యలు చేపడతున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని రేషన్ షాపుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి దానిపై క్యూ.ఆర్.కోడ్ ఏర్పాటు చేస్తున్నామని, మొబైల్ ఫోన్ ద్వారా దీనిని స్కాన్ చేసి రేషన్ సరఫరాపై కార్డుదారులు తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చని అన్నారు. పంపిణీ చేసిన రేషన్ బియ్యం నాణ్యతను కార్డుదారుల నుండి అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన ఫోర్టీ ఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, రేషన్ షాప్ డీలర్లు అవకతవకులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ రాకేష్, డిఎస్ఓ ఏ.పాపారావు ఏఎస్ఓ చల్లా లక్ష్మీనారాయణ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఎం రత్నకుమారి ఉన్నారు.

# పవిత్ర యోగా సంగమం..







**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, జూన్ 1, మేజర్ న్యూస్:** యోగా మన ఘన వారసత్వ సంపద అని.. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే యోగాను ప్రతిఒక్కరూ తమ రోజువారీ టైమ్‌టేబుల్‌లో మొదటి అంశంగా చేసుకోవాలని ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా ఆదివారం జిల్లా ఆయుష్, పర్యాటకం, వైద్య ఆరోగ్యం తదితర శాఖల సంయుక్త ఆధ్వర్యంలో వీటీపీఎస్ భాగస్వామ్యంతో ఇబ్రహీంపట్నం, పవిత్ర సంగమం వద్ద ప్రత్యేక యోగాభ్యసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. వివిధ శాఖల అధికారులు, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు, యోగా ఔత్సాహికులతో కలిసి యోగాసనాలను అభ్యసించారు. ఈ సందర్భంగా చక్రధర్‌బాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి చొరవ కారణంగా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఏటా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నామని, ఇది దేశానికే గర్వకారణమన్నారు. రాష్ట్రం నలుమూలలకూ యోగా విశిష్టతను చేరువచేసేందుకు గౌరవ ముఖ్యమంత్రి మార్గనిర్దేశనంతో రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంతమంచి కార్యక్రమంలో ఏపీ జెన్‌కో భాగస్వామ్యం కావడం ఆనందం కలిగిస్తోందన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాలతో పాటు అనేక ప్రజాప్రయోజన కార్యక్రమాల్లో జెన్‌కో భాగస్వామ్యమవుతూ ఎప్పుడూ ముందుంటోందన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన, అంతరాయాలకు ఆస్కారం లేని విద్యుత్ సరఫరాకు కృషిచేస్తున్నామని, రాష్ట్ర విద్యుత్ రంగానికి దేశంలో మంచి గుర్తింపు ఉందన్నారు. ప్రసార నష్టాలను తగ్గించడంలోగానీ, నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలోగానీ ముందంజలో ఉన్నట్లు తెలిపారు. మన ఆరోగ్య సంరక్షణకు రోజూ ఉదయం సూర్య నమస్కారాలు ఎలాగైతే చేస్తామో అదేవిధంగా ప్రతిఒక్కరూ పీఎం సూర్యఘర్ పథకం ద్వారా రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను రాయితీతో ఏర్పాటుచేసుకోవాలని, ప్రతి ఇల్లూ మినీ విద్యుత్ జనరేటర్‌గా ఎదగాలని కోరుకుంటున్నట్లు జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు.

**ప్రతి గ్రామం, వార్డులో విస్తృతంగా యోగాంధ్ర కార్యక్రమాలు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యోగాంధ్ర మాసోత్స వాల్లో భాగంగా జిల్లాలో ప్రతి గ్రామం, ప్రతి వార్డులోనూ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఇదే విధంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మొదటిగా గాంధీ హిల్‌పై నిర్వహించామని, ఇదేవిధంగా ఆదివారం పవిత్ర సంగమం వద్ద నిర్వహించిన కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. మనం చేసే ప్రతి పనిద్వారా మంచి ఫలితాలు రావడానికి, ఆరోగ్యకర జీవితాన్ని సొంతం చేసుకు నేందుకు యోగా ఉపయోగపడుతుందని, జూన్ 21 నాటికి మన జిల్లాలో కొత్తగా పది లక్షల మందికి యోగాను నేర్పించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయుష్ డిపార్టుమెంట్ 45 నిమిషాల కామన్‌యోగా ప్రోటోకాల్ ఆధారంగా యోగాను ప్రతి వర్గానికీ చేరువచేసేందుకు కృషిచేస్తున్నామని.. ఇందుకు ప్రతిరోజు ఒక థీమ్ పెట్టుకొని యోగా అవగాహన, అభ్యసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ యోగాను ప్రాక్టీస్ చేసి, మరో పదిమందితో ప్రాక్టీస్ చేయించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కార్యక్రమంలో చిన్నారుల ఆర్టిస్టిక్ యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

**డ్రగ్స్ రహిత జిల్లా, రాష్ట్రం లక్ష్యంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమం:**

కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు, కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. ఈగెల్ ఎస్పీ ఎన్.నగేష్‌బాబు, ఇతర అధికారులతో కలిసి డ్రగ్స్ వద్దు బ్రో (1972 టోల్ ఫ్రీ నంబరు) నినాదంతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. డ్రగ్స్ భూతాన్ని సమాజం నుంచి తరిమేసే లక్ష్యంతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను అమలుచేస్తున్నామని, డ్రగ్స్ రహిత జిల్లా, రాష్ట్రం లక్ష్యంగా భాగస్వామ్య పక్షాలతో కలిసి కృషిచేస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో వీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ పి.శివరామాంజనేయులు, యోగాంధ్ర నోడల్ అధికారులు డా. ఎం.సుహాసిని, జిల్లా పర్యాటక అధికారి శిల్ప, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, ఆయుష్ అధికారి డా. రామత్లేహి, డా. రత్నప్రియదర్శిని, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, ఎస్ఈలు, ఈఈలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చౌకబియ్యం పక్కదారి పట్టకూడదు

(మొదటిపేజీ తరువాయి)

పునఃప్రారంభించి కార్డుదారులకు 5 కిలోల బియ్యము, అర కిలో పంచదార, కిలో కందిపప్పు పంపిణీ చేశారు. అలాగే 65 సంవత్సరాలు పైబడిన బోయిన సుశీల, గొడవర్తి మహాలక్ష్మి ఇండ్లకు మంత్రి, కలెక్టరు, సంయుక్త కలెక్టర్ తో కలిసి స్వయంగా వెళ్లారు. వృద్ధురాలు సుశీల అంత్యోదయ అన్న యోజన ఏ ఏ వై కార్డు కలిగి ఉండడంతో 35 కిలోల ఉచిత బియ్యము, ఒక కిలో పంచదార, ఒక కిలో కందిపప్పు పంపిణీ చేశారు. అనంతరం వారు మహాలక్ష్మికి 5 కిలోల బియ్యం, అరకిలో పంచదార, ఒక కిలో కందిపప్పు పంపిణీ చేశారు. తదనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చక్కని పరిపాలన అందించేందుకు కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రజా పంపిణీ వ్యవస్థ పైన ప్రత్యేక శ్రద్ధ వహించారని, ప్రజల నుండి చాలా విన్నపాలు వచ్చిన మీదట అవన్నీ గమనించి మరల చౌక ధరల దుకాణాల ద్వారానే నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆ నిర్ణయం మేరకు జూన్ 1వ తేదీ నుండి వినియోగదారులకు దుకాణాల చౌక దుకాణాల వద్ద బియ్యం తదితర సరుకులు పంపిణీ చేసే ఏర్పాటు చేశామన్నారు. గతంలో బియ్యం మొత్తం పక్కదారి పడుతుండేదని, చౌక దుకాణాల్లో ఉంటే తాము ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకునే అవకాశం ఉండేదని ఎండియు వాహనాలు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూసి అన్ని రకాలుగా నష్టపోతున్నామని, కొంత బియ్యం కాకినాడ నుండి ఏ విధంగా షిపుల్లో అక్రమంగా ఏవిధంగా తరలిపోయిందో మనమందరం చూసామన్నారు. చౌక బియ్యాన్ని ఒక పెద్ద స్కామ్ గా చేసిన పరిస్థితి గత ప్రభుత్వంలో ఉందన్నారు. ప్రస్తుతం పారదర్శకంగా చేయాలని ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక నిర్ణయం తీసుకొని ప్రతినెల 15వ తేదీలోగా ఎప్పుడు కావాలంటే అప్పుడు ప్రజలు సరుకులు తీసుకునే విధంగా వెసులుబాటు కల్పించారన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మరల సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఎప్పుడు కావాలంటే అప్పుడు దగ్గరలో ఉన్న చౌక దుకాణానికి పోయి సరుకులు తెచ్చుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. ప్రతి వ్యక్తికి 5 కిలోల బియ్యం చొప్పున కనీస ఆదరువు ప్రభుత్వం ఇస్తుందన్నారు. అర కిలో పంచదార 17 రూపాయలకు, కిలో కందిపప్పు 67 రూపాయలకు అందిస్తున్నామన్నారు గతంలో చౌక దుకాణాల డీలర్లు కూడా చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. అలాగే 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారికి సరుకులను వారి ఇంటి వద్దకే డీలర్ తీసుకొని వచ్చి అందజేస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు కోటి 25 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, అందులో నాలుగు కోట్ల పైన రేషన్ బియ్యం తీసుకుంటున్నారన్నారు. కార్డులో ఎంతమంది ఉంటే ఒక్కొక్కరికి 5 కిలోలు చొప్పున బియ్యం ఇస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డులలో తల్లిదండ్రులతో పాటు పెళ్లయిన పిల్లలు ఉంటే వారికి వేరుగా కార్డులు ఇచ్చే ఏర్పాటు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో దాదాపు 70 వేల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా మరో 20 వేల దరఖాస్తులు రేషన్ కార్డుల కోసం వచ్చాయన్నారు. కార్డుల విషయంలో ఎవరికైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని వాటికి కాలపరిమితి లేదన్నారు.బియ్యం వద్దనుకునే వారికి ఆ బియ్యం ఖరీదును నేరుగా లబ్ధిదారులకు అందించాలని ఆలోచనతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. ప్రభుత్వం బియ్యం కొని పేద ప్రజలకు ఉచితంగా అందచేస్తుందన్నారు. బియ్యానికి బదులుగా రాగులు, సజ్జలు వంటి చిరుధాన్యాలను కూడా ప్రభుత్వం సరఫరా చేయాలని ఆలోచిస్తుందన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో చౌక దుకాణాల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీకి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎవరికి ఇబ్బంది కలిగిన జిల్లా పౌరసరఫరాల అధికారిని సంప్రదించేలా వారి సెల్ ఫోన్ నంబర్తో ఒక బోర్డును ఏర్పాటు చేశామన్నారు. ప్రతినెల 5వ తేదీలోగా 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారికి సంబంధిత డీలర్లు వారి ఇంటి వద్దకే నిత్యవసర సరుకులు అందజేస్తారన్నారు.సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ జిల్లాలో 5.22 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా 1059 చౌక దుకాణాలకు నిత్యావసర సరుకులు సరఫరా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డి ఎస్ ఓ వి.పార్వతి, పౌరసరఫరాల సంస్థ డిఎం శిరీష, ఆర్ డి ఓ కే స్వాతి, స్థానిక ప్రముఖులు బండి రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ కౌన్సిలర్ చిన్ని, తహసిల్దారు పి మధుసూదన్ రావు, రేషన్ డీలర్ సైకం సాంబమూర్తి తదితర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

# రెటినోబ్లాస్టోమా కంటి క్యాన్సర్ పై ఎల్ వీపీఈఐ అవగాహన పరుగు





**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రపంచ రెటినోబ్లాస్టోమా అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని విజయవాడ లోని ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్ వీపీఈఐ ) ఆధ్వర్యంలో స్థానిక బి ఆర్ టి ఎస్ రోడ్డులో రెటినోబ్లాస్టోమా పైన అవగాహన కల్పించే " వైటథాన్ " పరుగు (రన్) కార్యక్రమం నిర్వహించారు. రెటినోబ్లాస్టోమా " వైటథాన్ పరుగును ఆదివారం ఉదయం 6 గంటలకు సిద్దార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకటేశ్వర రావు పరుచూరి జెండా ఊపి ప్రారంభించారు. అనం తరం మాట్లాడుతూ ఈ అవగాహన ర్యాలీలో భాగస్తుని కావటం సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరు రెటినోబ్లాస్టోమా వ్యాధి పట్ల చక్కని అవగాహన పొందటమే కాకతోటి వారితో ఆవిషయం పంచుకుని రెటినోబ్లాస్టోమా వ్యాధిని ముందస్తుగా గుర్తించుటకు ప్రోత్సహించాలని అన్నారు. " వైటథాన్ " పరుగులో పాల్గొన్న ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల, కోడె వెంకటాద్రి చౌదరీ క్యాంపస్, విజయవాడ హెడ్ డాక్టర్ అనసూయ గంగూలీ మాట్లాడుతూ ప్రజలకు ప్రత్యేకించి తల్లితండ్రులకు రెటినోబ్లాస్టోమా వ్యాధి లక్షణాలు గురించి తెలియచేయాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. తల్లితండ్రులు తమ పిల్లల కంటి లోపల తెల్లని ప్రతిబింబం గుర్తించినట్లయితే వారు వెంటనే సరియైన నేత్ర వైద్యులను సంప్రదించాలి అన్నారు.

రెటినోబ్లాస్టోమా అంటే ఒక కంటి క్యాన్సర్ వ్యాధి దీనిని ముందుగా గుర్తించటం, చికిత్స అందించటం చాల ముఖ్యం. సరియైన సమయంలో స్పందిస్తే పిల్లల జీవితం, కన్ను, దృషిని కాపాడవచ్చునని ఆమె ఈ" వైటథాన్ " ర్యాలీ (రన్) సందర్భంగా వివరించారు. రెటినోబ్లాస్టోమా " వైటథాన్ " ర్యాలీని కంటి క్యాన్సర్ తో బాధపడుతున్న పిల్లల జీవితాలను మెరుగుపరిచే దిశగా, వ్యాధిని ముందస్తుగా గుర్తించుటకు సరియైన అవగాహన కల్పించుటకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# రౌడీషీటర్‌లకు, సస్పెక్ట్‌లకు కౌన్సిలింగ్






**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు పోలీసు కమిషనరేట్ పరిదిలోని అన్నీ పోలీసు స్టేషన్ల పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ లకు, లా& ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్‌లకు, చెడునడత కలిగిన వ్యక్తులకు వివిధ సమయాలలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ........ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రామాలలో పాల్గోవడం చేయరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అంతేకాకుండా గంజాయి, ఇతర మత్తు పదార్ధాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరు చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఎవ్వరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాలలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# మసులా బీచ్ ఫెస్టివల్‌కు సమన్వయంతో పనిచేయాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జూన్ మొదటి వారంలో జరగనున్న మసులా బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు అధికారులందరూ సమన్వయంతో పని చేస్తూ విజయవంతం చేసేందుకు కృషి చేయాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు.ఆదివారం మధ్యాహ్నం రహదారులు భవనాల అతిథి గృహంలో మంత్రి మసులా బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై అధికారులు, పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మసులా బీచ్ ఫెస్టివల్ పకడ్బందీ నిర్వహణకు ప్రచారం, ఆహ్వానం, వేదిక, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మీడియా సమన్వయం తదితర విభాగాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తామని, ఈ కమిటీల్లో అధికారులు, నాయకులు సభ్యులుగా ఉంటారని, ఉత్సవాలు పూర్తయ్యేంతవరకు ఈ కమిటీలు సమర్ధవంతంగా పనిచేస్తాయని తెలిపారు. అదేవిధంగా మంగినపూడి బీచ్ అభివృద్ధికి శాశ్వత కమిటీ ఏర్పాటుకు కూడా త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 5వ తేదీన 100 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణతో మసులా బీచ్ ఫెస్టివల్ కార్యక్రమం ప్రారంభిస్తామని, జూన్ 6, 7, 8 తేదీలలో షెడ్యూల్ ప్రకారం నిరంతరంగా క్రీడలు, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బీచ్ ఫెస్టివల్ వచ్చేందుకు వీలుగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఇతర ప్రాంతాల నుంచి బస్సులను నడుపుతామన్నారు. చిలకలపూడి నుండి బీచ్ వరకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వన్ వే చేస్తామని, తిరుగు ప్రయాణం అయ్యేవారికి పోతేపల్లి, గోకవరం, పెదపట్నం తదితర గ్రామాల మీదగా 216 జాతీయ రహదారిని చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

కార్యక్రమంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ఎక్కువ మొత్తంలో ట్రాన్స్ఫార్మర్లను ఇప్పటికే ఏర్పాటు చేశామని, ప్రత్యామ్నాయంగా జనరేటర్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. మసుల బీచ్ ఫెస్టివల్ నేపథ్యంతో జూన్ 3వ తేదీన నగరంలోని కోనేరు సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 2018 మసులా బీచ్ ఫెస్టివల్ కంటే మిన్నగా ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని, ఈ కార్యక్రమం అంతటికీ నోడల్ అధికారిగా మెప్మా పీడీ సాయిబాబు వ్యవహరిస్తారని మంత్రి తెలిపారు. మసుల బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై నగరంలో రేపు మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ తో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించి కార్యక్రమం నిర్వహణ పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు.ఈ సమావేశంలో మెప్మా పీడి సాయిబాబు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి ఝాన్సీ లక్ష్మి, ఈవెంట్ మేనేజర్ ఆనంద్, తాసిల్దార్ హరనాథ్, కూటమి నాయకులు బండి రామకృష్ణ, మార్కెట్ యార్డ్ చైర్మెన్ కుంచె నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, స్థానిక కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మగ్గయ్య ఆకస్మిక మృతి బాధాకరం: గురుమూర్తి

**తోట్లవల్లూరు జూన్ 1 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని గరికపర్రు గ్రామ పసుపు సైనికుడు బచ్చుల చింతయ్య తండ్రి బచ్చుల మగ్గయ్య ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన భౌతిక కాయానికి రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి నివాళులర్పించారు. తనకు ఎంతో ఆప్తుడైన చింతయ్య తండ్రి అకాల మరణం తనను ఎంతో బాధించిందని ఈ సందర్భంగా గురుమూర్తి పేర్కొన్నారు. మగ్గయ్య భౌతిక కాయానికి గురుమూర్తి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గురుమూర్తి తో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రతి ముగ్గురు భారతీయుల్లో ఒకరు పాలను పానీయంగా వినియోగిస్తున్నారు




**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా, గోద్రేజ్ జెర్సీ భారతీయ వినియోగదారుల ప్రాధాన్యతలను "బాటమ్స్ అప్ ఇండియా సేస్ చీర్స్ టు మిల్క్!" అనే నివేదిక విడుదల చేసింది. ప్రతి ముగ్గురు భారతీయులలో ఒకరు పాలను పానీయంగా వినియోగిస్తుండగా, హైదరాబాద్‌కు చెందిన వినియోగదారుల్లో 28 శాతం మంది పాలను పానీయంగా ఇష్టపడుతున్నారని అధ్యయనం వెల్లడిస్తుంది. దీనితో పాటుగా, 53 శాతం మంది వినియోగదారులు ఇంట్లో ఫ్లేవర్డ్ పాలు తాగడానికి లేదా తాము తాగే పాలకు అదనపు రుచిని జోడించడానికి ఇష్టపడుతున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు పోషకమైన రిఫ్రెష్‌మెంట్ డ్రింక్ ఇవ్వడానికి అనుకూలమైన, ఆనందించే మార్గంగా ఫ్లేవర్డ్ పాలను ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఈ అధ్యయనం పై గోద్రేజ్ జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి మాట్లాడుతూ, వినియోగదారుల ప్రాధాన్యతలకు తగినట్లుగా ఉత్పత్తులను అందజేయడానికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు.




## 10 వేలకు పైగా బ్రాండ్లతో మింత్రా ఈవోఆర్‌ఎస్ 22వ ఎడిషన్


**గుంటూరు మేజర్ న్యూస్ :** ప్రముఖ ఫ్యాషన్, సౌందర్యం, జీవనశైలి ఉత్పత్తులకు గమ్యస్థానాలలో ఒకటైన మింత్రా, జూన్ 12 వరకు తన ఫ్లాగ్‌షిప్ ఎండ్ ఆఫ్ రీజన్ సేల్ (ఈవోఆర్ఎస్) 22వ ఎడిషన్‌ను కొనసాగిస్తోంది. ఫ్యాషన్ ప్రియులు అందరూ ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్న ఈ షాపింగ్ ఈవెంట్ దేశవ్యాప్తంగా ఫ్యాషన్, సౌందర్య ప్రియులను ఆకట్టుకుంటోంది. మెట్రో, భారీ నగరాల నుంచి (టైర్ 1, టైర్ 2), అభివృద్ధి చెందుతున్న నగరాలకు చెందిన కొనుగోలుదారులు అంతర్జాతీయ, దేశీయ, స్వదేశీ బ్రాండ్‌లతో సహా 10 వేల కన్నా ఎక్కువ బ్రాండ్‌ల నుంచి నాలుగు మిలియన్లకు పైగా స్టైళ్లలో విస్తృత ఎంపికను అన్వేషించుకునేందుకు మింత్రా అవకాశం కల్పిస్తోంది. ప్రతి ఒక్కరి అభిరుచి, ట్రెండ్‌కు అనుగుణంగా ఈ సీజన్‌లో వారికి కావలసిన అత్యంత స్టైలిష్ ఎంపికలతో, వారి వార్డ్‌రోబ్‌లు, బ్యూటీ షెల్ఫ్‌లను భర్తీ చేసుకోవాలని కోరుకుంటున్న వారికి వారికి ఇది చివరి గమ్యస్థానంగా నిలుస్తోంది.

## ఎన్ఈపీ 2020 లక్ష్యాలను సాధించేలా యూనివర్సిటీలకు ఎన్ఐఏటీ చేయూత



**విజయవాడ మేజర్ న్యూస్ :** నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ) 2020 మార్గదర్శకత్వంలో భారతదేశ విద్యా వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ మార్పులో యూజీసీ, ఏఐసీటీఈ సంస్థలు విద్యను నైపుణ్యానికి పెద్దపీట వేసేలా మార్చేందుకు ఎంతగానో కృషి చేస్తూ అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఈ ఆశయాన్ని వేగంగా ముందుకు తీసుకు వెళ్లడానికి నెక్ట్‌వేవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్డ్ టెక్నాలజీస్ (ఎన్ఐఏటీ) ప్రారంభించిన యూనివర్సిటీ భాగస్వామ్య మోడల్ ను భారతదేశంలోని పలు యూజీసీ అప్రూవ్డ్ యూనివర్సిటీలు అమలు పరుస్తున్నాయి. నైపుణ్య ఆధారిత విద్యకు దేశవ్యాప్తంగా అనుకరించదగినదిగా ఈ మోడల్ స్ఫూర్తిదాయకంగా నిలిచింది. విద్యార్థులకు చక్కటి కెరియర్ ఫలితాలు తీసుకువచ్చేలా యూనివర్సిటీలను బలపరచడమే ఈ భాగస్వామ్యం యొక్క లక్ష్యమని నెక్ట్‌వేవ్, ఎన్ఐఏటీ కో ఫౌండర్, సీఈవో రాహుల్ అత్తులూరి అన్నారు. 'ఒక వైపు యూనివర్సిటీ అకడమిక్ ప్రోగ్రామ్‌ను తమదైన విధంగా కొనసాగిస్తుంది. మరో వైపు విద్యార్థులు ఇండస్ట్రీకి సిద్ధమవ్వడానికి అవసరమైన ప్రతిదీ హ్యాండ్స్-ఆన్ స్కిల్ ట్రైనింగ్, ఇండస్ట్రీ ప్రాక్టీషనర్ల నుంచి సెషన్స్, ఫ్యాకల్టీ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్స్, ప్లేస్మెంట్స్ ఇలా కావలసిన అన్నింటిలో ఎన్ఐఏటీ తోడ్పాటునందిస్తుంది' అని ఆయన తెలిపారు.

## రేషన్ పంపిణిలో పాల్గొన్న పడవల మోహన్ త్రినాధ్



**గూడూరు మేజర్ న్యూస్ :** మల్లవోలు గ్రామంలో ఆదివారం రేషన్ దుకాణంలో ప్రజలకు బియ్యం తదితర సరుకులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన్ త్రినాధ్, మాజీ సర్పంచ్ ప్రత్తిపాటి శ్రీనివాసరావు, అల్లు బాల,బత్తిన బుజ్జి, భాశీంశెట్టి శ్రీనివాస్,డీలర్ గుండు గోపాల్ పాల్గొన్నారు.



## రేషన్ షాప్ వద్దనే సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ వెంకటేష్

**జగ్గయ్యపేట, జూన్ 1, మేజర్ న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా రేషన్ షాపులు వద్దనే సరుకులు పంపిణీలో భాగంగా గౌరవరంలో షాప్ నెంబర్ 0601055. ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేసిన సర్పంచ్ ముత్తవరపు వెంకటేష్ పావని, మండల పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమ తరలింపును అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజల హర్షిస్తున్నారని, ప్రతినెలలో 15 రోజులపాటు రోజుకు రెండు పూటలా సరుకులు పంపిణీ విధానం వల్ల ప్రజలందరికీ నిత్యవసర సరుకులు అందుతాయని, వృద్ధుల కు, వికలాంగులకు, వారి ఇళ్ల వద్దకే డీలర్లు వెళ్లి సరుకులు అందిస్తారని తెలిపారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల ప్రభుత్వంపై పడిన భారాన్ని ఈ ప్రభుత్వం తొలగించి మంచి నిర్ణయం తీసుకుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాధినీడి శేషగిరిరావు, మైనీడి పూర్ణచంద్రరావు, పసల రమేష్ బాబు, దుగ్గిరాల మహేష్, కొప్పుల నాగేశ్వరరావు, నెట్టెం రమేష్, కాసినీడి బుజ్జిబాబు, షేక్ బాజీ, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యవసర సరుకులు పంపిణీ పునః ప్రారంభం



**కోడూరు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు మండలంలో రేషన్ షాపు వద్ద నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు పునః ప్రారంభించారు. ఆదివారం కోడూరు 5వ వార్డులో గల( కొండవీటి సురేష్) రేషన్ డిపోను పీసీ చైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శ్రీను నాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పలువురు రేషన్ లబ్ధిదారులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కూటమి నాయకులు కార్యకర్తలు, రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## స్కూల్ అసిస్టెంట్ నుండి ప్రధాన ఉపాధ్యాయులుగా నక్కా బాబురావు



**పెనుగంచిప్రోలు,జూన్ 1, మేజర్ న్యూస్:** వివిధ పాఠశాలలో,వివిధ హోదాలలో పని చేసిన నక్కా బాబురావుకు ఇటీవల జరిగిన ఉపాధ్యాయ కౌన్సిల్లో పెనుగంచిప్రోలు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా ప్రభుత్వం నియామకం చేసినది. అందుకు బాబురావు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనేకమంది మిత్రులు సహచర విద్యాసంస్థల అధినేతలు ఆయనకు శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ ప్రభుత్వ ఇచ్చిన ఈ బాధ్యతనుబాధ్యతతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని బాబురావు అన్నారు.

## రేషన్ దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కుమార్ రాజా



**పెదపారుపూడి జూన్ 1 మేజర్ న్యూస్:** మండల పరిధిలోని జమిదింటకుర్రు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణంను పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా ఆదివారం పునః ప్రారంభించారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎండియు వాహనాలను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయడంతో పాటు రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని ఆయన ప్రారంభించి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వై.రంగారావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, తెలుగుదేశం పార్టీ నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# వానపాములలో అభివృద్ధి, సమస్యలపై అధికారులతో సమీక్ష





**పెదపారుపూడి జూన్ 1 మేజర్ న్యూస్:** మండల పరిధిలోని వానపాముల గ్రామంలో ప్రగతి పథంలో మన పామర్రు అనే కార్యక్రమాన్ని స్థానిక శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా స్థానిక నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని అధికారులు పాల్గొని ఆయా శాఖల ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులను అందిస్తోందని వాటిని సక్రమంగా వినియోగించి ప్రజల అవసరాలు తీర్చాలని అధికారులను కోరారు. గ్రామంలో ఇప్పటికే పలు సిసి రోడ్లను నిర్మించామని, రానున్న కాలంలో గ్రామంలో పూర్తి స్థాయిలో సిసి రోడ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతేకాక పక్కా డ్రైన్‌ల నిర్మాణం వంటి పనులు కూడా చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రజలు స్థానిక నాయకులు దృష్టికి తీసుకురావాలని, అవి పరిష్కారం కాకుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఇప్పటికే తమ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చే హామీలను దశల వారీగా అమలు చేస్తోందన్నారు. దీపం పథకం కింద సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తోందని, తల్లికి వందనం కార్యక్రమం జూన్ నెల 12వ తేదీన ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక పెంచిన పింఛను ప్రతినెల ఒకటో తేదీన ఇంటి వద్ద అందిస్తున్నామన్నారు. త్వరలోనే అవసరమైన వారికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ళ నిర్మాణం చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, తహసిల్దార్ వై.రంగారావు, ఎండిఓ సయ్యద్ సాధిక్ లతోపాటు వివిధ శాఖల అధికారులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల నుండి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ముందు ప్రజలు తెలిపిన సమస్యలు కొంతమేరకు పరిష్కరించామని, మిగిలిన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఆయన ప్రజలను కోరారు.

# నిత్యావసర దుకాణం ప్రారంభం



**వీరులపాడు, జూన్ 1,మేజర్ న్యూస్:** రేషన్ దుకాణాల ద్వారా నిత్యవసర వస్తువులు పంపిణీ కేంద్రాలను కూటమి నాయకులతో కలిసి వీరులపాడు ఇంచార్జి తాసిల్దార్ నాగరాజు రెవిన్యూ ఇన్స్పెక్టర్ సంధ్య గ్రామ సర్పంచి రామవతు కోటి పలు అధికారులు ప్రజా ప్రతినిధులు జుజ్జూరు గ్రామంలోని 20 వా నెంబరు రేషన్ షాపును ప్రారంభించినారు. రేషన్ కార్డు ఉన్న వారందరికీ బియ్యం అందజేసే కార్యక్రమం ఆదివారం ఉదయం చేపట్టారు రేషన్ షాపుల వద్ద నుండి ఒకటో తారీకు నుండి 15వ తేది వరకు మీకు కేటాయించిన వస్తువులు సేకరించాలని ప్రజలను కోరారు. రేషన్ డీలర్లు ఎటువంటి అవకతవకలు పాల్పడకుండా ప్రజలకు ఇబ్బందులు కలగజేయకుండా ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాలని డీలర్లను ఆదేశించిన ఇన్చార్జి తాసిల్దార్ నాగరాజు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మండల అధ్యక్షులు కొండ్రగుంట శ్రీనివాస్ కుమార్ కంచికచర్ల వీరులపాడు నాగార్జునసాగర్ ప్రాజెక్టు చైర్మన్ కాపా రాంబాబు, నందిగామ నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు కొమ్మూరి శేషు,జనసేన నాయకులు పసుపులేటి వర కుమార్ తమ్మిశెట్టి లక్ష్మీనారాయణ, గ్రామ రెవిన్యూ అధికారి వెంకటేశ్వరరావు డీలర్లు దేవరకొండ శ్రీనివాసరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పామర్రులో రేషన్ దుకాణాన్ని పునఃప్రారంభించిన ఎమ్మెల్యే



**పామర్రు జూన్ 1 మేజర్ న్యూస్:** పామర్రు టౌన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పునఃప్రారంభించారు. కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్ తదితరులతో కలసి ఆయన పామర్రు 8వ నెంబర్ రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రేషన్ దుకాణాల ద్వారా సక్రమంగా పేదలకు నిత్యావసర సరుకులు సరఫరా అవుతుండగా ఆ విధానాన్ని మార్చి ఇంటి వద్దకే రేషన్ అంటూ వాహనాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ వాహనాల ఏర్పాటు ద్వారా ప్రజాధనం పెద్ద ఎత్తున దుర్వినియోగం అయిందని, అటు వాహన యజమానులు, ఇటు అధికారులు కూడా అక్రమాలకు పాల్పడటంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విచారణ జరిపి తిరిగి పాత పద్ధతిని ప్రవేశపెట్టిందన్నారు. పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి పట్టడం సహించరాని విషయమని, ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి కఠిన నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ప్రతి నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుండి 8 గంటల వరకు ఆదివారాలు కూడా రేషన్ దుకాణాల వద్ద బియ్యం పంపిణీ జరుగుతుందని తెలిపారు. కావున రేషన్ కార్డుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమకు వీలైన సమయంలో రేషన్ దుకాణానికి వెళ్లవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జి.రవికాంత్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాము, తెలుగుదేశం పార్టీ నాయకులు గొట్టిపాటి లక్ష్మీ దాసు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వీధుల్లో లబ్ధిదారుల పడిగాపులు ఇక ఉండవు

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** రేషన్ సరుకుల కోసం వీధుల్లో లబ్ధిదారుల పడిగాపులు ఇక ఉండవు అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం అవనిగడ్డలో రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రేషన్ డీలర్లు పని చేయాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రభుత్వ సూచన మేరకు వారి ఇంటి వద్దకు డీలర్లు తీసుకువెళ్లి రేషన్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రతి నెల 15 రోజులపాటు రేషన్ డీలర్లు తమ దుకాణాల వద్ద ప్రజలకు అందుబాటులో ఉంటారని, రేషన్ సరఫరా వ్యవస్థ సమర్థవంతంగా నిర్వహించేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రేషన్ సరఫరా చేశారు. ఒక వృద్ధురాలికి ఇంటి వద్ద రేషన్ అందజేశారు. కార్యక్రమంలో ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ఎంపీపీ తుంగల సుమతి దేవి, దివి ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, పర్చూరి దుర్గాప్రసాద్, విశ్వనాథపల్లి పాప, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, తహసీల్దార్ కే.నాగమల్లేశ్వరరావు, కూటమి నాయకులు, అధికారులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## జూన్ 2 సోమవారం విద్యుత్ అంతరాయం

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ది. 02/06/2025 అనగా సోమవారం ఉదయం 07:00 గంటల నుండి మధ్యాహ్నం12:00 గంటల వరకు 33/11 కె.వి కౌతవరం సబ్ స్టేషన్‌లో గల 11కేవీ కౌతవరం, వడ్లమన్నాడు ఫీడర్ పరిధిలోని కౌతవరం, వడ్లమన్నాడు, వేమవరం, వేమవరంపాలెం, గాదేపూడి గ్రామాలలో విద్యుత్ లైన్స్ నకు దగ్గరిలో గల చెట్లను కొట్టడం జరుగుతుంది. కావున పైన తెలిపిన గ్రామములలోని గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులకు పైన చెప్పబడిన సమయములో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. కావున ప్రజలందరూ సహకరించవలసినదిగా విద్యుత్ శాఖ ఏపిసిపిడిసిఎల్ గుడివాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. బి. శ్రీనివాసరావు కోరారు.

# చల్లపల్లిని సందర్శించిన విజయవాడ గైనకాలజిస్ట్ అసోసియేషన్ వైద్యుల బృందం






**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** విజయవాడ గైనకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ త్రిపురసుందరి, డాక్టర్ సోమలతల ఆధ్వర్యంలో గైనకాల జిస్ట్ బృందం ఆదివారం స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించారు. ఆదివారం 3487 వ రోజు స్వచ్ఛ సేవలో విజయవాడ గైనకాలజిస్ట్ అసోసియేషన్కు చెందిన 24 మంది గైనకాలజిస్ట్ బృందం, మరో ఆరుగురు వైద్యులు పాల్గొన్నారు. స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి సేవలందించారు. జూన్ 5 పర్యావరణ దినోత్సవం పుర స్కరించుకుని హైవే పక్కన, కాసానగర్లో డివైడర్ మధ్యలో మొక్కలు నాటారు. స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం ద్వారా సుందరీకరించిన ప్రదేశాలను పరిశీలిం చారు. గ్రామమంతా తిరిగి స్వచ్ఛ సేవకుల శ్రమతో ఆహ్లాదకరంగా మారిన ప్రాంతాలను చూశారు. పవర్పాయింట్ ప్రజంటేషన్ ద్వారా స్వచ్ఛతా విశేషా లు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, వైద్యదంపతుల ఆధ్వర్యంలో పదకొండేళ్లుగా స్వచ్ఛఉద్యమం కొనసాగుతుండటం ఎంతో స్ఫూర్తినిస్తోందనీ, డిఆర్కె దంపతుల కృషి అసామాన్యమైనదన్నారు. స్వచ్ఛచల్లపల్లికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. స్వచ్ఛ చల్లపల్లి విశేషాలను డిఆర్కె ప్రసాద్, పద్మావతిలు వైద్యులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, డాక్టర్ వరుణ్, గైనకాలజిస్ట్ బృందం పాల్గొనగా, ఆదివారం స్వచ్ఛ సేవలో 74 మంది స్వచ్ఛ కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీకొండలమ్మకు భక్తుల మొక్కుబడులు, పాలపొంగళ్ళు







డాక్టర్ బక్కు లక్ష్మీ నాగేంద్రరావు, కుటుంబం వీల్ చైర్ బహుకరణ

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ఈ రోజు ఆదివారం సందర్భముగా అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారిని సుమారు 25,000 మంది పైగా భక్తులు దర్శించుకొనినారు. అత్యధిక స్థాయి లో భక్తులు శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి యొక్క మొక్కుబ డులు తీర్చుకొనినారు. శ్రీ అమ్మవారి దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు ఉచితంగా మజ్జిగ, ప్రసాదము, త్రాగు నీరు, ఏర్పాటు చేసినారు. దేవస్థానము పరిసర ప్రాంతములలో శానిటేషన్, భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించినారు. శ్రీ కొండలమ్మ అమ్మవారి దర్శనమునకు విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు, అవాంఛనీయ, సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్ఐ సత్యనారాయణ, వారి సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేసినారు. ఈరోజు గుడ్లవల్లేరు వాసులు ఆయుర్వేదం వైద్య నిపుణులు డాక్టర్ బక్కు లక్ష్మి నాగేంద్ర రావు, కుటుంబ సమేతముగా విచ్చేసి వీల్ చైర్ బహూకరించినారు. వారిని కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు ఆలయ మర్యాదలతో సత్కరించినారని ఒక ప్రకటనలో తెలియజేసినారు.

## సాగునీరే తీర ప్రాంత వాసులకు తాగునీరు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మరో వారం పది రోజులలో పంట కాలువలకు సాగునీరు ఇరిగేషన్ శాఖ అధికారులు విడుదల చేయనున్నారు ఈ తరుణంలో పంట కాలవలను పూర్తిగా పక్షా ళన చేయవలసిన అవసరం ఎంతైనా ఉందనేది నిత్య సత్యం. దివిసీమకు వచ్చే పంట కాలవ కు ఇరువైపులా గృహాలు ఉండడంతో ప్రమాదకరమైన ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడంతో పాటు సెప్టిక్ ట్యాంకు పైపులు సైతం పంట కాలవలోకి వదిలేస్తూ పంట కాలవ నీరు కలుషితం చేస్తున్నారు. పంట కాలువల ద్వారా వచ్చే నీరు కేవలం సాగుకే కాకుండా తీర ప్రాంత ప్రజలు తాగునీటికి కూడా ఉపయోగిస్తున్నారు. ఈ నీటిని తీర ప్రాంత ప్రజలు తాగునీటిగా వినియోగించడంతో తరచుగా అనారోగ్య పాలవుతున్నారు కావున సంబంధిత అధి కారులు పంట కాలువలకు వేసిన మురుగు, సెప్టిక్ ట్యాంకుల పైపులను తొలగించి దివిసీమ ప్రజలే అనారోగ్య పాలు కాకుండా సురక్షితమైన తాగునీటిని అందించేందుకు చర్య తీసుకోవాలని దివిసీమ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. యనమలకుదురు లాకుల నుండి అవనిగడ్డ లాకుల వరకు ప్రధాన పంట కాలవల ఇరువైపులా ఉన్న ఆయా పంచాయతీ అధికారులు ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాలువ దిగువ ప్రాంత వాసులు అభిప్రాయపడుతున్నారు.

## త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలి



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** మండలంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0 పథకంలో భాగంగా 2761 మందికి ఇండ్ల నిర్మాణం మంజూరు అవ్వగా 2025 మే 31 నాటికి 1095 ఇండ్ల నిర్మాణం పూర్తై, 841 ఇండ్ల నిర్మాణం ప్రారంభించక, 825 ఇండ్ల నిర్మాణం ప్రారంభం చేసి వివిధ దశలలో ఉన్నాయని గుడ్లవల్లేరు ఎంపిడిఓ విజయసారధి తెలిపారు. ఈ పథకం మార్చి 31 2025 కి పూర్తి అవ్వాల్సి ఉన్నప్పటికీ నిర్మాణం ప్రారంభించి వివిధ దశలలో ఉన్న లబ్ధిదారులు నష్టపోతారనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం మరికొంత కాలం గడువు పెంచిందన్నారు. అందులో భాగంగా ఇంటి నిర్మాణం కొరకు ఎస్సీ, బీసీ వారికి 50 వేల రూపాయలు, ఎస్టి వారికి 75 వేల రూపాయలు అదనపు ఆర్థిక సహాయం అందించి 31 అక్టోబర్ 2025 లోగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని ఎంపిడిఓ అన్నారు. కృష్ణా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గుడ్లవల్లేరు మండలంలో గోడలు నిర్మాణం పూర్తి చేసి, స్లాబ్ వేయుటకు సిద్ధముగా ఉన్న 47 మంది ఈ జూన్ 12 లోపు స్లాబ్ నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. తదనుగుణంగా గ్రామ ఇంజనీరింగ్ సహా యకులు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సహాయంలో భాగంగా ఎ వరైతే లబ్ధిదా రులు కొంత డబ్బు వారి బ్యాంకు ఖాతాలో పొంది ఉన్నారో, వారికి తెలియచేసి ఇంటి నిర్మాణం పూర్తి పూర్తి చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా నిర్మాణం చేయాలి అని గత రెండు నెలలుగా అనగా అదనపు ఆర్థిక సహాయం పొందినప్పటినుంచి వివరిస్తూ, గత పది రోజులుగా వారికి నోటీసులు అందజేస్తూ ఉన్నారన్నారు. గుడ్లవల్లేరు మండలంలో అదనపు ఆర్థిక సహాయం గ్రామాల వారీగా పొందిన లబ్ధిదారుల జాబితాను ప్రతి గ్రామపంచాయతీలో లేదా సచివాలయంలో గల నోటీస్ బోర్డ్ లో, గత నెల ఏప్రిల్ 15వ తారీఖు నుండి అధికారులు పొందుపరిచి ఉంచారని, కావున సంబంధిత లబ్ధిదారులు వెనువెం టనే మీ ఇంటి నిర్మాణం తిరిగి ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆదేశించడమైనది. ఏ విధమైన సందేహం ఉన్నా లేదా ఇతర సమాచారం కొరకు హౌసింగ్ ఏఇ ( 7093930703) లేదా తనను (9100084643) సంప్రదించాలని గుడ్లవల్లేరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి. విజయసారధి కోరారు.

## మోసపూరిత వ్యవస్థకు స్వస్తి, పేదలకు తొలగిన ఇబ్బందులు



**తోట్లవల్లూరు జూన్ 1 మేజర్ న్యూస్:** గత ప్రభుత్వంలో రేషన్ కార్డు లబ్ధిదారులు సరుకులు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురైందని, రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పేర్కొన్నారు. ఇంటి వద్దకే రేషన్ పేరుతో జగన్ ప్రభుత్వం వ్యానును ఏర్పాటు చేసిందని, కానీ తమ ఇంటికి ఎప్పుడు వస్తుందో తెలియక ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. సకాలంలో రేషన్ అందించకపోగా బియ్యాన్ని బ్లాక్ మార్కె ట్కు తరలించడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. అటువంటి మోసపూరిత వ్యవస్థకు స్వస్తి పలికి నిత్యం అందు బాటులో ఉండే విధంగా రేషన్ డీలర్ల వద్ద పంపిణీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరు గ్రామంలో కొక్కిలిగడ్డ పోతురాజుకు చెందిన 12వ నెంబర్ దుకాణం వద్ద ఆయన వినియోగదారులకు రేషన్ పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు గొరిపర్తి గోపయ్య, తోట సాయి, తటుకూరి రమణ, ఎం.ఎం.దౌల, గొరిపర్తి శ్రీనివాసరావు, కోటేశ్వ రరావు, వల్లూరు అశోక్, వల్లూరు కుమార్, ఎలా సలాం, ఈదుపుగంటి జాను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శంకర్ బాబు జన్మదిన వేడుకలు



**పామర్రు జూన్ 1 మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతి నిధి, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండపాక శంకర్ బాబు జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పామర్రు పాలశీతలీకరణ కేంద్రం కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాతిశెట్టి నరేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని శంకర్ బాబుకు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.

## అశ్వారావుపాలెంలో రేషన్ దుకాణాన్ని పునః ప్రారంభించిన ఎమ్మెల్యే



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అశ్వారావుపాలెం గ్రామంలో ఆదివారం రేషన్ దుకాణ పునః ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి రేషన్ దుకాణాన్ని పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుదారులు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదములు తెలుపుతూ ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, గ్రామ సర్పంచ్ పండ్రాజు లంకమ్మ ప్రసాద్, నీటి సంఘ అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ యక్కటి నాగరాజు, ఎంపీటీసీ కటికల బాలాజీ, తహసీల్దార్ కే.నాగమల్లే శ్వరరావు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నేడు జలజన జాగరణ యాత్ర

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** విజయవాడ యనమలకుదురు శివాలయం నుండి సోమవారం ఉదయం నుంచి జల జన జాగరణ యాత్ర చేయను న్నట్లు బిజెపి సీనియర్ నాయకులు జి వి నగరాయులు ఆదివారం ఒక ప్రకటనలో చెప్పారు. సాగునీరు, తాగునీరు కాలువలు, కృష్ణానది వ్యర్థాలతో కలుషితం కాకూడదని కోరుతూ భారతీయ కిసాన్ సంఘ ఆధ్వర్యంలో జల జన జాగరణ యాత్ర ప్రారంభమై సాయంత్రానికి మోదుమూడి చేరుకోవడం జరుగుతుందని అన్నారు. 3వ తేదీ మంగళవారం మండల పరిధిలోని పాత ఎడ్లంక కృష్ణా నది కోతకు గురి అవుతున్న ప్రాంతానికి పరిశీలన చేసి కోడూరు మండలం పాలకాయ తిప్ప వద్ద అవుట్ పాల్ స్లూయిస్ పరిశీలన చేసి మచిలీపట్నం మండలం సందర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమ నాయకుల తో పాటు పలువురు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు

## జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎంగా మాధవ కుమార్



నందివాడ,మేజర్ న్యూస్: ఎన్ వై.మాధవ కుమార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెన్ననపూడి గెజిటెడ్ హెచ్ఎంగా అధ్యాపక బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో నందివాడ ఎంఈఓగా నాలుగు సంవత్సరాలు పని చేసి ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉత్తమ ఎంఈఓ అవార్డ్ అందుకున్న మాధవ కుమార్ మరల నందివాడ మండలం లో జాయిన్ అయిన సందర్భంగా అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, పలువురు యూనియన్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులకు శిక్షణ, క్రమశిక్షణతో పాటు సృజనాత్మక ఆలోచనలు, క్రీడల పట్ల ఆసక్తి, పచ్చదనం పర్యావరణం పట్ల శ్రద్ధ కలిగే విధంగా చేస్తామని ఆయన తెలిపారు.

## మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా



కోడూరు మేజర్ న్యూస్ : రోజుకి రెండు పూటలా పూటకు 20వేల లీటర్లు, రెండు పూటలా రోజుకు 40000 లీటర్ల మంచినీటి సరఫరా కార్యక్రమం ఆదివారం కోడూరు మండలం చింతకోళ్ళ, ఇరాలి గ్రామాలలో మంచినీటిని సరఫరా చేస్తున్న మన శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో తీర గ్రామాల దాహం తీర్చేందుకు నలభై వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ ద్వారా సోమవారం కోడూరు మండలం చింతకోళ్ళ, ఇరాలి గ్రామాలకు తాగునీరు అందచేశారు.

## శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి బొట్టు బిళ్ళలు, మంగళ సూత్రాలు అందజేత



పెనుగంచిప్రోలు,జూన్ 1,మేజర్ న్యూస్: పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి విజయవాడ నగరం చిట్టినగర్ వాస్తవ్యులు కె. శివశంకర్ లక్ష్మీ శ్రావణి దంపతులు రాళ్లతో తయారు చేయబడిన మూడు గ్రాముల 700 మిల్లీగ్రాముల బంగారు బొట్టు బిళ్ళ విరాళంగా ఆలయ ఏఈఓ కి అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేసినారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం రాజ రత్నాపురంకు చెందిన విజయలక్ష్మి నాలుగున్నర గ్రాముల బంగారు మం గళసూత్రాలు అమ్మవారికి ధరించాలని ఆలయ ఏవో తిరుమలేశ్రావుకు అందజేశారు. దాతలకు వేద పండితుల చేత వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శాసనసభలు పెద్ద ప్రసాదం అందజేసినారు.

## ఉలవలపూడి రేషన్ పంపిణీ ప్రారంభించిన సర్పంచ్



గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ : గుడ్లవల్లేరు మండలంలోని ఉలవలపూడి గ్రామములో రేషన్ దుకాణం వద్ద సరుకుల పంపిణీని గ్రామ సర్పంచ్ ప్రారంభం చేయటం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఎండియు వ్యానులను రద్దుపరచి, తిరిగి డీలర్ల ద్వారా రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టడంతో నేడు మండలంలో డీలర్లే రేషన్ డిపోలవద్ద సరుకులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నిర్ణయం పై సంతోషం వ్యక్తం చేస్తూ గ్రామ సర్పంచ్ పామర్తి కన్యభాస్కరరావు సమక్షంలో సరుకుల పంపిణీ ప్రారంభించారు. గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పామర్తి రామయ్య, మరియు వార్డు మెంబర్లు పామర్తి శ్రీరామమూర్తి, జోగి చిన్నమ్మ, డీలర్ వెంకటేశ్వరమ్మ, రేషన్ లబ్ధిదారులు పాల్గొనటం జరిగింది.

## రేషన్ పంపిణీలో చెరుకూరి సూరిబాబు, గద్దం రాజు



మచిలీపట్నం మేజర్ న్యూస్ : 26వ డివిజన్ పౌర సరఫరాల దుకాణం షాప్ డీలర్ అన్నం పద్మజ నిర్వహిస్తున్న రేషన్ షాప్ ను డివిజన్ ఇంచార్జ్ చెరుకూరి సూరిబాబు ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు గద్దంరాజు చేతుల మీదగా లబ్ధిదారులకు బియ్యం, పంచదార, కందిపప్పు, నిత్యవసరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్చార్జిలు వన్నెరెడ్డి ప్రసాద్, షేక్ బాషా నాయకులు గద్దం రఘు,డిక్కొల్లు వెంకట్రావు,పులవర్తి శేఖర్,బోయినరవి, మూసా,జిలానీ, డివిజన్ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# హామీలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుంది

### గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



నందివాడ,మేజర్ న్యూస్: అవాంతరాలు ఎదురవుతున్న ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ, రూరల్ మండలాల్లోని రేషన్ దుకాణాల్లో నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం ఉదయం ప్రారంభించారు. ముందుగా గుడివాడ పట్టణంలోని 15వ వార్డు గుడ్ మేన్ పేటలోని ఐదో నెంబర్ రేషన్ దుకాణంలో సరుకులు పంపిణీ ప్రారంభించారు. అనంతరం రూరల్ మండలం బిల్లపాడు గ్రామంలోని 26వ నెంబర్ రేషన్ దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాము లబ్ధిదారులకు సరుకులు అందించారు. ఆయా ప్రాంతాల్లో అధికారులు, కూటమి నేతలతో కలిసి 60 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగుల ఇళ్లకు వెళ్లి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన ఎమ్మెల్యే రాము రేషన్ సరుకుల పంపిణీలో ఇబ్బందులు ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా గుడ్ మేన్ పేటలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే రాము మాట్లాడారు... లబ్ధిదారులకు అందుబాటులో ఉండే విధంగా రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరమనీ హర్షం వ్యక్తం చేశారు. ప్రతికూలతలు ఎదురవుతున్న సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతినెల క్రమం తప్పకుండా లబ్ధిదారులకు హక్కుగా ఒకటో తేదీ కల్లా పెన్షన్ నగదు అందిస్తున్నామన్నారు. హామీల అమల్లో భాగంగా త్వరలో తల్లికి వందనం పథకం కూడా మొదలు కాబోతుందని ఎమ్మెల్యే రాము తెలిపారు. గత తుగ్లక్ ప్రభుత్వ పాలనలో ప్రజలు అనేక కష్టాలు పడ్డారని.... ప్రజల మంచి కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు. ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో గుడివాడ గుడివాడలో అనేక ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలు పరిష్కరించామని, రాబోవు రోజుల్లో సమస్య ఉన్న ఒకటి రెండు చోట్ల కూడా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల నిధులతో గుడివాడలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్ల నిర్మాణం ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యి, అనుమతులు కూడా వచ్చాయని తెలిపారు. రాబోవు ఏడాదిలో గుడివాడ రూపురేఖలు మార్చేలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు. రేషన్ సరుకుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తితే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని నిబంధనలు అతిక్రమించేలా డీలర్లు ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో బాలసుబ్రమణ్యం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి, మండల టిడిపి నాయకులు కర్రే వెంకటగిరి,జనసేన నాయకులు సాయన రాజేష్, గుడివాడ టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, చేకూరు జగన్ మోహన్ రావు, కంచర్ల సుధాకర్, పంద్రాజు సాంబయ్య,మెరుగు మొజేష్,షేక్ ఇబ్రహీం, సయ్యద్ జబీన్,మహమ్మద్ రఫీ, రబ్బాని,వేసపోగు ఇమ్మానుయేలు,అద్దంకి కమల, అల్లాడ శ్రీనివాస్, మరీదు రోహిణి, ఐదో నెంబర్ రేషన్ డీలర్ టంకాల మాధవి, 26 నెంబర్ రేషన్ డీలర్ కర్రే సుధీర్,రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త మురళి, గుడివాడ తాసిల్దార్ రామకోటేశ్వరరావు, ఎండిఓ విష్ణు ప్రసాద్, ఆర్ ఐ నాగబాబు, బిల్లపాడు టిడిపి నాయకులు తాళ్లూరి పెద్ద నాగేశ్వరరావు, నిమ్మగడ్డ శాస్త్రులు,జి. వీర నాంచారయ్య, మెండు జోజి బాబు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## తపస్వి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



పమిడిముక్కల జూన్ 1 మేజర్ న్యూస్ : విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహకారాన్ని అందిస్తున్న తపస్వి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పమిడిముక్కల మండలం కృష్ణాపురం గ్రామంలోని తపస్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులను ఎమ్మెల్యే కుమార్ రాజా చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ రాజా నిర్వాహకులను అభినందిస్తూ వారు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 2024 – 2025 సంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. అలాగే మండలంలో అత్యధిక మార్కులు సాధించిన పాఠశాలలు, అధిక ఉత్తీర్ణత శాతం సాధించిన పాఠశాలకు జ్ఞాపికలను అందజేశారు. ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద విద్యార్థులకు ప్రత్యేకంగా స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, నగదును అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యతోపాటు మహిళల అభ్యున్నతికి, వైద్య సేవలకు తాము ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్, ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం



మచిలీపట్నం మేజర్ న్యూస్ : ఈ నెల 2 వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక – మీకోసం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక– మీకోసం కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీ పంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అం దజేయవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక – మీకోసం కాల్ సెంట ర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా జిల్లా కలెక్టర్ కోరారు.

# వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



మచిలీపట్నం మేజర్ న్యూస్ : సంకల్ప్ కృషి అభియాన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి అంటూ మండల వ్యవసాయ శాఖ అధికారి హారిక పిలుపు ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల వ్యవసాయ పథకాలు భూసార పరీక్షలు, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను రైతులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయంలో ఎప్పటికప్పుడు నూతన పద్ధతులు తెలుసుకోవడం వల్ల రైతులకు ఎనలేని ప్రయోజనం కలుగుతుందన్నారు. ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల వారు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు శివరాజ్ సింగ్ చౌహాన్ పిలుపు మేరకు ఆదివారం మచిలీపట్నం గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవసాయ శాస్త్రవేత్త జె. యశ్వంత్ కుమార్ కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల వారు మాట్లాడుతూ కె.వి.కె నిర్వహించే కార్యక్రమాలు, లభ్యమయ్యే విత్తనాలు, భూసార పరీక్ష యొక్క ఉపయోగాల గురించి వివరించారు.డా. కె. నాగేంద్రరావు, వ్యవసాయ పరిశోధనా స్థానం వారు మాట్లాడుతూ, వరిలో నూతన వంగడాలు, వివిధ నేలలకు అనువైన వరి రకాలు వాటిలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కాటం మధు మాట్లాడుతూ వికసిత్ కృషి సంకల్పం అభియాన్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం, ప్రభుత్వం చేపడుతున్న వ్యవసాయ కార్యక్రమాలు గురించి వివరించారు. ఉద్యాన శాఖాధికారి ఎన్.మానస మాట్లాడుతూ వివిధ ఉద్యాన సబ్సిడీ వివరాలు తెలియజేశారు. మత్స్య శాఖ, పశు సంవర్ధక శాఖ వారు వారి శాఖల ద్వారా వచ్చే వివిధ పథకాల గూర్చి వివరించారు. బందరు రూరల్ పరిసర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**కంచికచర్ల జూన్ 1 మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 4న నిర్వహించ తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ సూచించారు. నియోజకవర్గ కేంద్రాలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ముఖ్య నాయకులు కార్యకర్తలతో ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ ఆదివారం కంచికచర్లలో సమావేశం నిర్వహించారు. కంచికచర్ల మండల కన్వీనర్ బండి మల్లికార్జున్ రావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో విజయం సాధించి సంవత్సరం గడిచినా సూపర్ 6 హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారాని పేర్కొన్నారు. అవినీతి కి కాదేది అనర్హం అనట్టుగా వనరులను దోచుకుంటున్నారని, దొంగే.. దొంగ దొంగా అన్నచందంగా తెలుగుదేశం నాయకులు ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు హామీలకు నేను గ్యారంటీ అన్న పవన్ కళ్యాణ్ కూడా స్పందించకపోవటం శోచనీయం అన్నారు. అధికారం చేపట్టిన నాటినుండి ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేదిస్తున్నారని అన్నారు. కార్యకర్తల కోసం అండగా అధినేత జగన్మోహన్ రెడ్డి ఉంటారని, నాయకులు కార్యకర్తలు ఎవరు అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. పార్టీ సంస్థగతంగా నిర్మాణం చేపట్టామని, త్వరలో పార్టీ సభ్యత్వ నమోదు, కార్యకర్తల ఆరోగ్య భీమా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రానున్న జగనన్న ప్రభుత్వంలో కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని, పార్టీ కోసం కష్టపడే వారికీ పదవులు దక్కుతాయన్నారు. కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీరులపాడు మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, కంచికచర్ల ఎంపీపీ షేక్ మలక్ బషీర్, మాజీ ఎంపీపీ పాటిబండ్ల హరి జగన్నాథ రావు, కంచికచర్ల ఉప సర్పంచ్, పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్ బాబు, కోటేరు ముత్తారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాలవ పెద్దబాబు, చింతా రవీంద్రనాథ్, బుడ్డి సత్యం, యోహాను, సన్నీ, కోటి,పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## లికాలువ చివరిభూములకు సాగునీటిని అందించాలి




**గన్నవరం, జూన్ 01, మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజకవర్గంలోని పంటపొలాలకు ఖరీఫ్ సీజన్లో సాగునీటి కొరత లేకుండా చూడాలని, కాలువ చివరి భూములకు సంవృద్ధిగా సాగునీటిని అందించాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ నీటి సంఘాల అధ్యక్షులు, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గడచిన 8 ఏళ్లు కాలంగా పూడికతీతకు నోచుకోని ఏలూరు కాలువ ఉంగుటూరు మేజర్ పూడికతీత పనులను బుద్ధవరంలో ఆదివారం ఉదయం యార్లగడ్డ ప్రారంభించారు. ఉంగుటూరు మేజర్లో పూడిక పేరుకుపోయి సాగునీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడటంతో ఆయకట్టు పరిధిలోని 8 వేల ఎకరాల్లో పంటపొలాలకు నీటి కొరత ఏర్పడుతుంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఎమ్మెల్యే యార్లగడ్డ దృష్టికి వెళ్ళటంతో సత్వరమే స్పందించిన ఆయన ఉంగుటూరు మేజర్ పూడిక తీయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నీటిసంఘం నిధులతో 10 కిలోమీటర్ల పొడవునా కాలువ పూడిక తొలగింపు పనులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ.. సకాలంలో పంట కాలువల మరమ్మత్తులు చేపట్టి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. నియోజకవర్గంలో రైతులకు పుష్కలంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు తమ సమస్యలను తనకు తెలియచేస్తే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని వెంకట్రావ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ కొసరాజు రాము, వైస్ చైర్మన్ జాస్తి విజయభూషణ్ కుమార్, దాసరి శ్రీకృష్ణ, టీడీపీ నాయకులు దయాల రాజేశ్వరావు, గొంది నరేంద్ర, మేడేపల్లి రమ, బోడపల్లి రాంబాబు, గొంది శివ తదితరులు పాల్గొన్నారు.



## రేషన్ షాపులను ప్రారంభించిన అక్కల గాంధీ

**జి కొండూరు మేజర్ న్యూస్ :** మునగపాడు గ్రామంలో..పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు రేషన్ షాపుల పునః ప్రారంభ కార్యక్రమంలో మైలవరం జనసేన పార్టీ ఇంచార్జ్.. రాష్ట్ర అధికార ప్రతినిధిఅక్కల రామ్మోహన్ రావు గాంధీ మైలవరం మార్కెట్ యార్డు చైర్మన్ పొనకళ్ల నవ్యశ్రీ జి. కొండూరు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు వై ఎల్. నరసింహా రావు, మైలవరం మండల జనసేన పార్టీ అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య, జనసేన నాయకులు శ్రీనివాస్, మహేష్, రామకృష్ణ, భాస్కర్, రామారావు, నాగేశ్వరరావు,సురేష్, గణేష్, రూపుల, నాయకులు పాల్గొన్నారు.

# గన్నవరంలో పోలీస్ కేసులపై బహిరంగ చర్చకు సిద్ధం



**గన్నవరం, జూన్ 01, మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యే అయిన ఈ సంవత్సర కాలంలో వైసిపి నాయకులు, కార్యకర్తలపై ఒక్క అక్రమ కేసు కూడా పెట్టలేదని ప్రభుత్వ వైపు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తేల్చి చెప్పారు. ఈ విషయంలో బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. ఆదివారం ఉదయం గన్నవరం చెంచుల కాలనీలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణతో కలిసి రేషన్ దుకాణంలో నిత్యావసర సరుకులు పంపిణీని యార్లగడ్డ ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గన్నవరంలో అక్రమ కేసులు పెడుతున్నామంటూ వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారాన్ని యార్లగడ్డ ఖండించారు. గత 5ఏళ్ళ వైసిపి పాలనలో సంవత్స రానికి ఎన్ని కేసులు పెట్టారో తాము అధికారంలోకి వచ్చిన ఈ సంవత్సరకా లంలో ఎన్ని కేసులు నమోదు అయ్యాయో పోలీస్ స్టేషన్ కి వెళ్లి విచారించి నిజాలు వెలికి తీయాలని మీడియా ని కోరారు. ఎన్నికల ప్రచారంలో అక్రమ కేసులు ఉండవంటూ తాను ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశా రు. గన్నవరం నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా తన పని తాను చేస్తున్నా నని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన మల్లవ ల్లి పారిశ్రామిక వాడలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తున్నానని 427 పరిశ్రమలు త్వరలో ఏర్పాటు కానున్నాయని తెలిపారు. తద్వారా నిరు ద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. రామవర ప్పాడు నుంచి బాపులపాడు మండలం బొమ్ములూరు వరకు జాతీయ రహదా రిపై పచ్చదనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కొన్ని దశాబ్దాలుగా అక్రమణకు గురైన గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు రహదారి విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నట్లు వివరిం చారు. రేషన్ దుకాణాల్లో సరుకులు ఇవ్వడం వల్ల లబ్ధిదారులకు వీలు కుది రినప్పుడు సరుకులు తెచ్చుకునే వెసులుబాటు కలిగిందన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల మాట్లాడుతూ గతంలో ఎండియు వాహనాల కోసం లబ్ధిదారులు రోడ్లమీద గంటల తరబడి ఎదురు చూసేవారని దుకాణాల్లో రేషన్ ఇవ్వడం ద్వారా లబ్ధిదారులకు ఎదురుచూసే ఇబ్బందులు తొలగిపోయాయన్నారు. దుకాణాల ద్వారా రేషన్ ఇవ్వడం శుభపరిణామంగా ఆయన పేర్కొన్నారు. ప్రజలను వేధించిన అధికారులు, నాయకుల పైనే రెడ్ బుక్ ప్రకారం చర్యలు తీసుకుంటామని, అమాయకులపై కాదని స్పష్టం చేశారు. గత ఐదేళ్లు గన్నవరంలో ఎటువంటి అరాచక పాలన సాగిందో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసు అని కొనకళ్ల గుర్తుచేశారు. తప్పు చేసిన నాయకులు అధికారులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దొంతు చిన్న, దయాల రాజేశ్వరరావు, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, జాస్తి శ్రీధర్, పడమట రంగారావు, యనమదల సతీష్, తాసిల్దార్ శివరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే వాటిని పరిష్కరించాలని యార్లగడ్డ అధికారులు ఆదేశించారు.



## సంక్షేమ ఫలాలను అట్టడుగు వర్గాల వరకు చేరవేయటమే ఏకైక కర్తవ్యం

**కోడూరు మేజర్ న్యూస్ :** ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను కచ్చితంగా అట్టడుగు వర్గాల దాకా చేరవేయటమే కూటమి ప్రభుత్వం యొక్క ప్రధాన కర్తవ్యం అని అందుకు ఉదాహరణే ఈ చౌక ధరల దుకాణాలను పునః ప్రారంభించటం అని వీటి ద్వారా నాణ్యమైన సరుకులను ప్రతి పేదవాడికి అందించటమే తమ యొక్క ధ్యేయమని అందుకు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, పౌర సరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ యొక్క కృషి అమోఘమని కోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. కోడూరు మండలంలోని నరసింహపురం, కోడూరు తూర్పు వైపు,, ఐబి పేట లో గల చౌక ధరల దుకాణాలకు స్థానిక నాయకులతో కలిసి ఈరోజు పున ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు..

## కారు చీకటిలో తెల్లదేవరపాడు గ్రామం

### వీధిలైట్లు లేక గ్రామం అంతా చీకటిమయం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** తెల్లదేవరపాడు గ్రామంలో వీధిలైట్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామ సర్పంచ్‌కి ఎన్నిసార్లు విన్నవించిన పెడచెవిన పెట్టి వీధిలైట్లు ఏర్పాటు చేయడం లేదని గ్రామంలో తొలకరి సమయం కావడంతో ప్రతిరోజు వర్షం కురవడంతో పాములు తేళ్లు అంటే అనేక విషపూరితమైన జీవులు తిరుగు తున్నాయని వాటి బారిన బడి ప్రజలు ఆసుపత్రులు పాలవుతున్నారని ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత మండల అధి కారులు స్పందించి గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరు తున్నారు. అధికారులు సర్పంచ్ స్పందించకుంటే మైలవరం శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆ గ్రామ ప్రజలు తెలిపారు

## కూటమి నాయకుల హడావుడి నడుమ రేషన్ దుకాణాలు పునఃప్రారంభం



**పమిడిముక్కల జూన్ 1 మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు రేషన్ దుకాణాల పునఃప్రారంభ కార్యక్రమం గ్రామాలలో కూటమి నాయకుల హడావుడి నడుమ ఆర్భాటంగా ఆదివారం ప్రారంభమైంది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయా గ్రామాల్లోని స్థానిక నాయ కులు, గ్రామ సర్పంచులు పాల్గొని దుకాణాలను ప్రారంభించారు. మండల కేంద్రమైన పమిడిముక్కలలో గ్రామ సర్పంచ్ ముళ్ళపూడి సునీత, కృష్ణాపు రం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెండ్ల సుబ్రహ్మణ్యం, గ్రామ ఉపసర్పంచ్ ఇమ్మడ బత్తుల వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొని రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. అలాగే మామిళ్ళపల్లి లో తెలుగుదేశం పార్టీ నాయకుడు చిగురుపాటి కృష్ణారావు, ఆముదాల పల్లి గోపాలకృష్ణ,మాజీ సర్పంచ్ పాండు, బొబ్బ శివ కేశవులు, వీఆర్‌ఏ ఆముదాలపల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు. అలినఖిపాలెం గ్రామం లో రెండు చౌకధరల దుకాణాలను గ్రామ సర్పంచ్ జైనబ్ సుల్తానా బేగం మీర్జా పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు అమీర్ అలీ, హనీఫ్ రజా, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ



**కంచికచర్ల జూన్ 1 మేజర్ న్యూస్ :** పరిటా లలో రేషన్ దుకాణాల ద్వారా సరకులు పంపిణీ ఆదివారం కంచికచర్ల మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు ఏఎంసీ చైర్మన్ కోగంటి బాబు ప్రారంభం చేశారు. కూటమి ప్రభుత్వం నిర్ణయం మేరకు జూన్ ఒకటి నుంచి దీనిని అమల్లోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కోగంటి బాబు మాట్లాడుతూ దివ్యాంగులు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ అందించడం జరుగుతుందని చెప్పారు. నెలలో తొలి 15 రోజులు సరకులు లబ్ధిదారులకు అందుబాటులో ఉంటాయన్నారు. ఇంటికి దగ్గరిలోని ఏ దుకాణంలోనైనా కార్డుదారులు రేషన్ తీసుకోవచ్చని కోగంటి సూచించారు. ప్రభుత్వం ప్రతి చౌక దుకాణానికీ అదనంగా పది శాతం బియ్యం సరఫరా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# పేద మహిళకు గర్భసంచి ఆపరేషన్ కోసం ఆర్థిక సహాయం



**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** కృష్ణలంక 20వ డివిజన్‌కి చెందిన నేటూరి సరోజినికి గర్భసంచి ఆపరేషన్ నిమిత్తం 50వేల రూపాయలు ఎల్‌ఓసి, 10 వేల రూపాయల వ్యక్తిగత ఆర్థిక సహాయాన్ని ఆదివారం ఉదయం టిడిపి నాయకులు గద్దె క్రాంతి కుమార్ శ్రీరామ్ మెడికేర్ హాస్పిటల్‌కి వెళ్లి బాధితురాలకు అందజేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ నేటూరి సరోజినీకి గర్భసంచి ఆపరేషన్ చేయించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని, ఆమెకు తల్లి లేదని, తండ్రి తండ్రి కూడా పక్షవాతంతో ఇబ్బంది పడుతున్నాడని, ఆపరేషన్ చేయించుకునేందుకు డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందని డివిజన్ టీడీపీ అధ్యక్షులు మోటేపల్లి చిన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు తెలియజేశారని, ఆమె పరిస్థితి చూసిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రభుత్వం నుంచి తక్షణమే 50 వేల రూపాయలు ఎల్‌ఓసి తీసుకువచ్చి అందించడం జరిగిందన్నారు. అలాగే మందులు ఇతర ఖర్చుల నిమిత్తం గద్దె ఫౌండేషన్ నుంచి వ్యక్తిగతంగా మరో 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలని తనను ఆదేశించడంతో హాస్పటల్ కి వచ్చి బాధితురాలిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేయడం జరిగిందన్నారు. సమస్యను తెలియజేసిన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి తో పాటు వ్యక్తిగతంగా కూడా డబ్బులు సహాయం చేసిన గద్దె రామమోహన్క, గద్దె క్రాంతిలకు డివిజన్ పార్టీ అధ్యక్షులు మోటిపల్లి చిన్న కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 20 డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు గల్లా శ్రీను, అడపా శివ, సాత కాళీ, గల్లా సుబ్బారావు, గణపతి నాగార్జున, హరికృష్ణ నాయుడు, కాకర్ల అనిల్, మారు బోయిన సాయి, మారుబోయిన సాయి, ఆకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చలేదు

## మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని మాజీ ఎంఎల్ఏ సింహాద్రి రమేష్ బాబు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లోనూ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ చంద్రబాబు వెన్నుపోటు పొడుస్తున్నారని చెప్పారు. గత ఎన్నికల్లో ఎంతమంది ఉంటే అంతమందికి అమ్మ ఒడి ఇస్తామ ని చెప్పి ఇంతవరకూ అమలు చేయలేదన్నారు. రైతు భరోసా, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి ఇలా ఏ ఒక్క వాగ్దానం అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని సింహాద్రి విమర్శించారు. నాలుగో తేదీ కూటమి ఏడాది పాలన వైఫల్యాలపై ఈ నెల 4వ తేదీన వైఎస్ఆర్సీపీ చేపట్టిన వెన్నుపోటు దినోత్సవం కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని మాజీ ఎంఎల్ఏ సింహాద్రి రమేష్ బాబు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి ఈ కార్యక్రమంకు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. స్థానిక శాసనసభ్యులు మండలు బుద్ధప్రసాద్ ఏడాది పాలనలో చేసిందేమీ లేదని ఆయన కుటుంబ సభ్యులు దోచుకోవటం దాచుకోవడమే చేశారని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.



మట్టి, ఇసుక, బుడక, బియ్యం, మద్యం ఎలా అన్నిట్లోనూ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు వాటాలు తీసుకుని దండుకుంటున్నారని సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సింహాద్రి వెన్నుపోటు దినోత్సవం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్ఆర్సిపి పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, యువజన భాగం రాష్ట్ర ప్రచార కమిటీ సహాయ కార్యదర్శి గాజుల జయ గోపాల్, పార్టీ నాయకులు కొల్లాల మధు, నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు యాసం శివ పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వానికి పతనం ప్రారంభమైంది



**విజయవాడ మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు జూన్ 4న తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం నాడు స్థానిక భవానిపురంలో ఓ నివాసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యులు పశ్చిమ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం పోస్టర్ ను ఆవిష్కరించి అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు జూన్ 4వ తేదీన చేపట్టనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు జయప్రదం చేయాలని కోరారు. లిఈ నిరసన కార్యక్రమం స్థానిక 40 డివిజన్లో గల బ్యాంక్ సెంటర్ వద్ద వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద నుండి నిరసన ర్యాలీ ప్రారంభమై ఎమ్మార్వో ఆఫీస్ వరకు నిరసన ప్రదర్శనగా వెళ్లి ఎమ్మార్వోకి వినతి పత్రం ఇస్తామని తెలిపారు. లి ఈ నిరసన కార్యక్రమంలో ప్రజలను కూడా భాగ్యస్వామ్యం చేయాలని పార్టీ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కోటమ్మ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నిరసన కార్యక్రమం చేపట్టబోతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేసేటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి స్థానిక ప్రజలను ఈ కార్యక్రమంలో మమేకం చేయాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు గడిచిన దినమే జూన్ 4 వెన్నుపోటు తినమని దుయ్యబడ్డారు.

## వైసీపీ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిన ఒక పెన్షన్ తప్ప ఏ సంక్షేమ పథకం పేద ప్రజలకు అందలేదన్నారు. కరోనా కష్టకాలంలో కూడా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఏకైక నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన దేశంలోనే ఏకైక ముస్లిం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ఈ ఏడాది కాలంలో అమ్మఒడి ఇవ్వాలి రైతు భరోసా ఇవ్వాలి ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వాలి ఇటువంటి సంక్షేమ పథకాలన్నీ ఇవ్వకుండా ప్రజలని ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలందరూ కూడా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఏడాది కాలంలో లక్ష 50 వేల కోట్ల అప్పు చేసిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏమి మేలు చేసింది అని ప్రశ్నించారు. ప్రజలను చాలా చక్కగా మోసం చేసే ఘనుడు చంద్రబాబు నాయుడు అని దుయ్యబట్టారు. ప్రజల్ని మోసం చేసేటువంటి కూటమి ప్రభుత్వం యొక్క మెడలను ఉంచేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే తిరుగుబాటు తప్పదు అన్నారు. కూటమి ప్రభుత్వానికి పతనం ప్రారంభమైందన్నారు. కరెంట్ బిల్లులు గాని, పెట్రోల్, డీజిల్ గాని నిత్యవసర సరుకులు గాని ప్రజలపై బాదుడే బాదుడు అనేటువంటి విధంగా ధరలమూత ఉందన్నారు. ప్రజలు గానీ వ్యాపారస్తులు గాని కుటుంబ ప్రభుత్వం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తుందని కేవలం రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందన్నారు. రెడ్ బుక్కు రాజ్యాంగం ద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను అరెస్టుల పేరుతో హింసిస్తూ శునకా ఆనందం పొందుతుందన్నారు. రానున్న రోజుల్లో కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తగిన మూల్యం చెల్లించుకొక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు బండి పుణ్యశీల, మండేపూడి చటర్జీ, యరడ్ల ఆంజనేయరెడ్డి, పడిగపాటి చైతన్య రెడ్డి, బాపతి కోటి రెడ్డి, యలకల చలపతిరావు, పార్టీ డివిజన్ ఇంచార్జ్‌లు తంగెళ్ల రామచంద్రరావు, నాయకులు కర్నాటి రాంబాబు, మనోజ్ కొఠారి, గౌస్ మొహిద్దీన్, షేక్ హయత్, గోదావరి బాబు, దాసి జయప్రకాష్ కెన్నడీ, మాజీ డైరెక్టర్లు, రాష్ట్ర అనుబంధ విభాగ అధ్యక్షులు, నాయకులు తోలేటి శ్రీకాంత్, బొందిలి నరేంద్ర సింగ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వీరులపాడు వెల్లంకి రేషన్ షాపులు రీ ఓపెనింగ్

**వీరులపాడు, జూన్ 1, మేజర్ న్యూస్:** ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రేషన్ బియ్యం పంపిణీని ఈ నెల(జూన్) 1వ తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా చేయనుంది. ఈ రేషన్ సరుకుల పంపిణీ షాప్‌లని కూటమి నాయకులు ప్రారంభించారు. గతంలో ఎండీయూ వాహనం ఎప్పుడు వస్తుందో వెళుతుందో తెలియని దుస్థితి ఉందని తెలిపారు. ఈ క్రమంలో రేషన్ కార్డుదారులు వాహనం కోసం రోడ్ల మీద తిరగాల్సిన పరిస్థితి ఉందని ఇపుడు కార్డుదారులకు ఆ కష్టాలు ఉండవని చెప్పారు. ఈ నెలలో ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణంలో సరుకులు తీసుకోవచ్చని కూటమి నాయుకులు, డీలర్స్ స్పష్టం చేశారు. 65 సంవత్సరాలు దాటిన ఒంటరి వృద్ధులు, వికలాంగులు, భార్యభర్తలు ఇద్దరు వృద్ధులైన వారి జాబితాలు రేషన్ షాపుల వారిగా సిద్ధం చేశామని వారికి 1 నుంచి 5వ తేదీలోగా డీలర్ ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు ఇస్తారని చెప్పారు. ఇల్లు మారి వేరే ప్రాంతాలకు వెళ్లిన వారికి కూడా పోర్టబిలిటీ విధానం ద్వారా సమీప రేషన్ దుకాణంలో రేషన్ ఆదివారాల్లో కూడా పొందవచ్చని తెలిపారు. రేషన్ దుకాణాల్లో అవినీతి జరగకుండా ప్రభుత్వం సరికొత్త యాప్ రూపొందించినట్లు వెల్లడించారు. ఈ యాప్ లో డీలర్ వివరాలు ఫోటోలతో సహా వస్తాయన్నారు. సరుకు ఎంత వచ్చింది. కార్డుదారులకు ఎంత పంపిణీ చేశారనే వివరాలు, రేషన్ దుకాణం వద్ద జనం ఎక్కువ మంది ఉన్నా వెంటనే ఈ యాప్ ద్వారా తెలుస్తుందన్నారు. వెల్లంకి లో షాప్ నెంబర్ 22, 37,లను ప్రారంభించిటం జరిగింది ఈ కార్యక్రమం లో చంద్రా సురేష్, రాంబాబు, శివంజినేయులు, వై వి రావు, వీరులపాడు మండలవెల్లంకి గ్రామ కూటమి నాయుకులు పాల్గొన్నారు.

## రేషన్ షాపులు పునః ప్రారంభం : దొండపాటి రాము



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కీర్తిరాయునిగూడెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ షాప్ పునః ప్రారంభం చేసిన మాజీ మైలవరం జెడ్పీటీసీ సభ్యులు దొండపాటి రాము. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు లబ్దిదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, అన్ని నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు అందేలా చూడాలని సూచించారు. వికలాంగులకు వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజు పంపిణీ చేయాలని ఎటువంటి అక్రమాలు జరగకుండా చూసుకోవాలని రేషన్ డీలర్ కు ఆదేశించారు. సాంకేతిక సమస్య వచ్చినప్పుడు లబ్ధిదారులు రేషన్ డీలర్ కి సహకరించాలని వారిని కోరారు. రేషన్ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్ధవంతంగా చేయాలనే దృష్టితో తీసుకున్న ఈ చర్యలు ప్రజల జీవనోపాధికి ఊతమిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి దొండపాటి విజయ్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు చనమోలు శ్రీనివాసరావు, నాగులపాటి నాగబాబు, నాయకులు మిద్దె జమలయ్య లబ్ధిదారులు పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999